క్లుప్తంగా

పేదల ఆరోగ్యానికి భరోసా


రోగులకు మందుల కిట్ ఇస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: పేదల వైద్యానికి భరోసా కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. ఇండస్ట్రియల్‌కాలనీ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. కార్పొరేటర్ సుధ శిబిరాన్ని సందర్శించి వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం రోగులకు మందుల కిట్లు అందించారు.

విహార యాత్రతో విజ్ఞానం


విహార యాత్రలో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులు

మల్కాపురం: ఒత్తిడి నివారణతో పాటు విజ్ఞానం పెంచుకోవడానికి విహారయాత్రలు ఎంతో దోహదపడతాయని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థులు బుధవారం ఉదయం నగరంలోని పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యటించారు. తొట్లకొండ,శిల్పారామంజాతర, రుషికొండ,జూ ప్రాంతాలకు వెళ్లారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

గోపాలపట్నం: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో బాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. 89వ వార్డు చంద్రనగర్ మైదానంలో క్రికెట్ పోటీలు జరిగాయి. పీడీలు కోచ్‌లు వ్యవహరించారు. జోన్ కమిషనర్ మల్లయ్య నాయుడు గోపాలపట్నంలో జరుగుతున్న క్రీడలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జీవీఎంసీ నిధులు కేటాయించవద్దని వినతి

మల్కాపురం: మల్కాపురం మార్కెట్‌లో జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టవద్దని మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం కార్పొరేటర్ కొణతాల సుధకు వినతి పత్రం అందజేశారు. గ్రామం మధ్యలో 50 ఏళ్ల నుంచి మార్కెట్ నిర్వహణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుకూలమైన స్థలం ఉంచామన్నారు. అలాంటి స్థలంలో జీవీఎంసీ నిధులు వెచ్చిస్తే స్థల హక్కులు జీవీఎంసీకి చెందే అవకాశం ఉందని వివరించారు. అలా కాకుండా సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేయాలని కోరారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో గ్రామ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు భోగవల్లి నాగభూషణం,అధ్యక్షుడు సత్యాల మహేష్,ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావుయాదవ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బాగుబడి

చదువుల బడి బాగు పడింది. నాణ్యమైన విద్య అందుతోంది. కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడే పరిస్థితికి చేరుకుంది. సర్కారు బడి అంటే చులకనగా మాట్లాడే పరిస్థితి నుంచి ఇప్పుడు సర్కారు బడే బాగుందంటూ కితాబు అందుకుంటుంది. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దూర దృష్టితో శ్రీకారం చుట్టిన నాడు– నేడుతో సాధ్యపడింది.



- రూపురేఖలు మారిన మల్కాపురం జీవీఎంసీ పాఠశాల
- కార్పొరేట్ లుక్, వసతులు
- డిజిటల్ బోధన
- ప్రవేశాలకు డిమాండ్
- రూ. కోటితో అభివృద్ధి పనులు
- 600 నుంచి 1115 మందికి చేరిన విద్యార్థుల సంఖ్య

మల్కాపురం: రేపటి తరానికి మంచి విద్య అందిస్తే భవిష్యత్తు ప్రగతిబాట పడుతుందని మేధావులు చెప్పిన మాటలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఆలోచించని విధంగా ప్రభుత్వ విద్య బలోపేతానికి కంకణం కట్టుకున్నారు. మౌలిక వసతుల నుంచి పాఠ్యపుస్తకాలు, సబ్జెక్టు ఉపాధ్యాయుల నియామకంతో పాటు జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు అందిస్తున్నారు. సకల వసతులు కల్పించి సర్కారు బడుల రూపు రేఖలు మార్చారు.

మల్కాపురం ప్రాంతంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ విద్యను పేద విద్యార్థులకు చేరువ చేశారు. ఉచితంగా ట్యాబ్‌లు ఇవ్వడంతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను మరో మారు నెమరు వేసుకోవడం.. సందేహాలను తీర్చుకోవడానికి ఉపయోగిస్తున్నారు.

అధునాత వసతులు సొంతం

అధునాతన సౌకర్యాలు సమకూరాయి. తరగతి గదులు,డిజిటల్ బోధన,విశాలమైన మైదాన ,ఆర్‌వో వాటర్ సౌకర్యం,వసతులతో కూడిన మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. కంప్యూటర్ బోధన,అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు,పది,తొమ్మిది తరగతుల విద్యార్థులకు వారం వారం క్లాస్ టెస్టులు,గ్రూప్ డిస్కషన్‌లు,తల్లిదండ్రులతో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సీట్ల కోసం విద్యార్థులు క్యూ కడుతున్నారు. నాలుగేళ్ల కిందట ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 600 ఉండగా నేడు 1115 (6 నుంచి 10వ తరగతి వరకు)మందికి చేరారు.


మల్కాపురం జీవీఎంసీ పాఠశాల ముఖద్వారం


డిజిటల్ క్లాస్‌రూమ్‌లో విద్యార్థులు

బోధన సూపర్



గతంలో తరగతి గదులు అధ్వానంగా ఉండేవి. నేలపై కూర్చొనేవాళ్లం. నేడు మంచి సౌకర్యంతో కూడిన బల్లలు వేశారు. ఫ్యాన్ సౌకర్యంతో డిజిటల్ బోధన చాలా బాగుంది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి విద్యార్థుల తరపున కృతజ్ఞతలు.

– ఎల్.అరుణకుమార్, పదో తరగతి విద్యార్థి

ప్రత్యేక తరగతులు



మా పాఠశాలలో పదికి పది ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సౌకర్యాలు మెరుగు పడడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. వారం వారం టెస్టులు, గ్రూప్ చర్చలు, ఆన్ లైన్ ద్వారా విద్యార్థుల సందేహాలు తీర్చుతున్నాం. నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. నాడు నేడుతో పాఠశాల రూపురేఖలు మారడంతో విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ చూపుతున్నారు.

– రమణికుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

చదువుకు అధిక ప్రాధాన్యం



నిరుపేద విద్యార్థుల తల రాత మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించడం మాకు వరం. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులతో పాటు నాణ్యమైన బోధన ఉండడంతో మాలాంటి వారు చదువుపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఇటువంటి సౌకర్యాలు పాఠశాలలో ఉండేవి కావు.నేడు ప్రభుత్వం చదువుతో పాటు సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వడం సంతోషం.

– జి.దిశ, పదో తరగతి విద్యార్థిని

కార్పొరేట్ లుక్‌తో తరగతి గదులు

గతంలో ప్రభుత్వ పాఠశాల అంటే పాడైన గచ్చులు, పెచ్చులాడిన గోడలు ఉండేవి. అత్యవసరమైతే ఆరుబయటలకు వెళ్లే పరిస్థితి ఉండేది. ఇప్పుడు గ్రానైట్ పలకలతో తరగతి గదులు తళతళలాడుతున్నాయి. డిజిటల్ బోర్డులు వచ్చాయి. తాగడానికి, కంచాలు శుభ్రం చేసుకోవడానికి కుళాయిలు ఏర్పాటు చేశారు. అత్యవసరమైతే ఆరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా మరుగుదొడ్లు నిర్మించారు. మొత్తంగా నాడు– నేడుతో పాఠశాల కార్పొరేట్ లుక్ సంతరించుకుంది.



ఆకర్షణీయంగా తరగతి గది

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు పరిధిలో కొత్తగా పింఛన్ మంజూరైన 14 మందికి శాంతినగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నగదు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతు ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్ పెన్షన్‌ను రూ.3వేలుకు పెంచారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెదుళ్ల శ్రీను , వార్డు సచివాలయ సెక్రటరీ నాగేశ్వరరావు, నీలవేణి , శ్రీనివాసరావు, సి.వో.సుధారాణి, వలంటీర్లు పాల్గొన్నారు.


పింఛను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

రాంజీ అభ్యుదయ సంఘం గౌరవాధ్యక్షుడిగా గొల్లమాల

కంచరపాలెం: రాంజీ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడిగా గొల్లమాల అప్పారావు నియమితుడయ్యారు. కంచరపాలెంలోని సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అప్పారావును ముఖ్య అతిథిగా జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంటిపాము కామేశ్వరి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని, వారికి చేదోడుగా దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అనేక సేవా కార్యక్రమాల్లో భాగస్వామి కావడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆర్.వెంకటరావు, కార్యదర్శి బి.అప్పారావు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


గొల్లమాల అప్పారావును సత్కరిస్తున్న సభ్యులు

అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మణరావు

సింధియా: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయమని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. వార్డులోని దుర్గానగర్‌లో బుధవారం నిర్వహించిన సామాజిక సమతా సంకల్ప కార్యక్రమానికి లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారన్నారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్‌కు నమస్కరిస్తూ వార్డులోని పలు ప్రాంతాల్లో సామాజిక సమతా సంకల్ప కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సచివాలయాల ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ ఫ్లెక్సీలపై సంతకాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆడారి సొంత నిధులతో పింఛన్లు


59వ వార్డులో పింఛన్లు అందిస్తున్న పుర్రె సురేష్‌యాదవ్


61వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: సాంకేతిక కారణాలతో సామాజిక పింఛన్లు అందని వారికి వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అండగా నిలుస్తున్నారు. తన సొంత నిధులతో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. 59వ వార్డులో 6 గురుకి, 61వ వార్డు పరిధిలో 5 గురుకి తన సొంత నిధులతో పింఛన్ అందిస్తున్నారు. ఆ మేరకు బుధవారం 59వ వార్డు ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ లబ్ధిదారులకు నగదు అందించారు. అలాగే 61వ వార్డు ప్రకాష్‌నగర్ పార్టీ కార్యాలయం వద్ద వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పింఛన్లు అందజేశారు.

ఏటీఆర్ పింఛన్ల పంపిణీ

గోపాలపట్నం: ఆడారి తులసీరావు ట్రస్ట్ ద్వారా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అందిస్తున్న పింఛన్లను బుధవారం జీవీఎంసీ 91వ వార్డులో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పంపిణీ చేశారు. తోటపోలమాంబ కాలనీకి చెందిన 5 గురికి రూ.3000 చొప్పున అందించారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా వీరికి ఆడారి ఆనంద్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వారికి ప్రభుత్వ పింఛన్లు మంజూరయ్యే వరకు ఏటీఆర్ ట్రస్ట్ ద్వారా పింఛన్లు అందించనున్నారు. కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు చుక్క పైడిరాజు రెడ్డి, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.


ఏటీఆర్ పింఛన్లు అందిస్తున్న బెహరా భాస్కరరావు

'పశ్చిమ'కు సంక్రాంతి శోభ

పశ్చిమ నియోజకవర్గ వాసులకు సంక్రాంతి ముందే వచ్చింది. రంగవల్లులతో వీధులు కళకళలాడుతున్నాయి. తెలుగువారి పెద్ద పండగను వేడుకగా నిర్వహించేలా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో మహిళలు తెలుగుదనం.. సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా పోటాపోటీగా రంగవల్లికలు వేస్తూ ఔరా అనిపిస్తున్నారు.

- రంగవల్లులతో కళకళలాడుతున్న వీధులు
- పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న మహిళలు


వార్డు విజేతలతో కార్పొరేటర్ నాగేశ్వరరావు


తోటపోలమాంబ ఆలయం వద్ద ముగ్గులను పరిశీలిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు తోటపోలమాంబ ఆలయం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి సంప్రదాయాలు, ఫ్యాన్ గుర్తును సైతం వేశారు. పోటీలను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పరిశీలించారు. అలాగే 92వ వార్డు వెంకటాపురం మూడు గుడులవద్ద , 89వ వార్డులోముగ్గులు పోటీలు జరిగాయి. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పూడిరాజు, చుక్క పైడిరాజు రెడ్డి, డానియల్, నీలాపు లోకేష్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఫైనల్స్

గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో ఫైనల్స్ జరుగుతాయని వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రతినిధులు వెల్లడించారు. నియోజకవర్గంలోని 14 వార్డుల్లో మూడు ఏజ్ గ్రూపుల్లో పాల్గొన్న ఈ పోటీల్లో 5 మంది చొప్పున వార్డుకు 15 మందిని ఎంపిక చేశారు. మొత్తంగా 210 మంది మహిళలు ఫైనల్స్‌లో పాల్గొంటారు. ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌తో పాటు జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు.

సింధియా: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. 40 నుంచి 60 ఏళ్ల మహిళలకు జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ క్రీడామైదానంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పోటీలను పర్యవేక్షించారు.

- జీవీఎంసీ 40 వార్డు పరిధి ఏకేసీకాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఇక్కడి విజేతలకు అభినందించారు.

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద జరిగిన ముగ్గుల పోటీలను వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం,వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ చుక్క వరలక్ష్మి,పార్టీ నాయకులు ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు.

- 60వ వార్డు శ్రీహరిపురం వద్ద జరిగిన పోటీలను వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్,వార్డు పార్టీ అధ్యక్షుడు ఆడారి హరీష్, స్థానిక నాయకులు గుంట సుందరరావు,ఆకుల కనకరాజు పర్యవేక్షించారు.
- 61వ వార్డు ప్రకాష్‌నగర్ వద్ద జరిగిన ముగ్గుల పోటీలను కార్పొరేటర్ కొణతాల సుధ,వార్డు అధ్యక్షుడు జీ.వీ.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు),నాయకులు వరలక్ష్మి,బూస అప్పలరెడ్డి పర్యవేక్షించారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో బుధవారం ముగ్గుల పోటీలు ఉత్సాహ వాతావరణంలో జరిగాయి. పోటీలను వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు నమ్మి శ్రీను పర్యవేక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరికీ చాటి చెప్పేలా మహిళలు తమ ముగ్గుల్లో వాటిని పొందుపరిచారు. కార్యక్రమంలో క్లస్టర్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు సన్యాసిరావు, సత్తిబాబు, పూడి సత్యం, అప్పలనాయుడు, వై. వెంకటేశ్వరరావు, కిరణ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొనాల విజయ వినీత, పద్మజ తదితరులు పాల్గొన్నారు.


60వ వార్డులో ముగ్గులను తిలకిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్


చూడముచ్చటగా ముగ్గు


58వ వార్డులో ముగ్గులను తిలకిస్తున్న పార్టీ అధ్యక్షుడు డి.ఎస్.రాజు


నవరత్నాలతో కూడిన ముగ్గును తిలకిస్తున్న నిర్వాహకులు



ఆకట్టుకున్న రంగుల రంగోళి


ఫ్యాన్ గుర్తుతో వేసిన ముగ్గు


పండగ శోభను ప్రతిబింబిస్తున్న రంగవల్లిక


ప్రకాష్‌నగర్ వద్ద జరిగిన పోటీల్లో పాల్గొన్న కార్పొరేటర్ సుధ

ఐక్య పోరాటాలతో 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: ఐక్య పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికుల పోరాటానికి ఎదురులేదని, ప్రభుత్వరంగ సంస్థల విషయంలో కేంద్రప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1063వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోరాడటం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

'కార్మికుల సమస్యలు పట్టని ఉక్కు యాజమాన్యం'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని స్టీల్ సిటూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్య రామ్ విమర్శించారు. కార్మికుల డిమాండ్లపై యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు పోటీదారుగా ఉన్న జిందాల్‌తో ఒప్పందం చేసుకోవడం వల్ల స్టీల్‌ప్లాంట్ ప్రతిష్టకు భంగం కలుగుతుందన్నారు. ఈ అంశంపై కలుగుతున్న అనుమానాలను నివృత్తి చేయకుండా పెంచే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేసి సెయిల్‌తో ఒప్పందం చేసుకోవాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు ఎన్‌జేసీఎస్ ఒప్పందంలో ఉన్న క్లాజులను తొలగించి వేతన సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వై.టి.దాస్, మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.